క్లుప్తంగా

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటుతున్న సీఐ అప్పలరాజు

పాయకరావుపేట: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సీఐ పి.అప్పలరాజు అన్నారు. పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. హరిత భారత్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు పోలీసు స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సీఐ అప్పలరాజు పాఠశాల యాజమాన్యాన్ని, విద్యార్థులను అభినందించారు. పచ్చని చెట్లను పెంచి, పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో శ్రీ చైతన్య ప్రిన్సిపాల్ మణిక్యాలరావు, ఏవో విజయ్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ సబ్ డివిజన్ ఏర్పాటు



ఇరిగేషన్ డీఈగా బాధ్యతలు చేపట్టిన జగదీశ్వరరావు

పాయకరావుపేట : నియోజకవర్గ కేంద్రం పాయకరావుపేటలో నీటి పారుదల శాఖ సబ్ డివిజన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు ఆ శాఖ డీఈగా నియమితులైన ఎస్.జగదీశ్వరరావు తెలిపారు. నియోజకవర్గానికి ఒక సబ్ డివిజన్‌లో భాగంగా పాయకరావుపేటలో కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో గల పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, కోటవురట్ల మండలాలు ఈ కార్యాలయం పరిధిలో ఉంటాయన్నారు. సబ్ డివిజన్ కార్యాలయం ఏర్పాటుతో డీఈగా జగదీశ్వరరావుతోపాటు, ఏఈగా జి.శ్రీరామమూర్తి, నక్కపల్లి, కోటవురట్ల మండలాల ఏఈగా జి.శ్యామ్‌గౌడ్, ఎస్.రాయవరం ఏఈగా అమీనా అక్బర్ భాను నియమితులయ్యారు.

కిసాన్ సమ్మాన్ నిధుల జమ నేడు



సమావేశంలో మాట్లాడుతున్న జేవీఎన్ రాజు

అనకాపల్లిటౌన్: ప్రధాని నరేంద్రమోదీ దేశవ్యాప్తంగా ఉన్న 1.25 లక్షల కిసాన్ సమృద్ధి కేంద్రాలను రైతులకు గురువారం అంకితం చేస్తూ, 14వ విడత కిసాన్ సమ్మాన్ నిధిని రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు జేవీఎన్ రాజు తెలిపారు. స్థానిక చదువులవారివీధిలోని పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. కిసాన్ సమృద్ధి కేంద్రాల వద్ద ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమాల్లో రైతులను భాగస్వాముల్ని చేసేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ద్వారపురెడ్డి పరమేశ్వరరావు మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించాక పురందేశ్వరి తొలిసారిగా 28న విశాఖలో నిర్వహించే ఉత్తరాంధ్ర జోన్ సమావేశానికి వస్తున్నారని, పార్టీ శ్రేణులు హాజరుకావాల్సిందిగా కోరారు. కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొంతిన భక్తసాయిరాం, కార్యదర్శులు సీహెచ్ నాగేశ్వరరావు, ఉడా రమేష్, అసెంబ్లీ కన్వీనర్ బొడ్డేడ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం



రైతులకు ఎరువులు అందిస్తున్న వాడ్రాపల్లి సర్పంచ్ నూకరాజు

మునగపాక: రైతు సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సేవలందిస్తున్నారని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు అన్నారు. వాడ్రాపల్లిలో బుధవారం రైతులకు ఎరువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజన్‌కు అవసరమయ్యే ఎరువులు, విత్తనాలను రాయితీపై అందిస్తున్నట్లు తెలిపారు. ఆర్‌బీకే సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అధికారుల సలహాలు, సూచనలు పాటించడం ద్వారా వ్యవసాయంలో మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో వీఏఏ తులసి పాల్గొన్నారు.

ముసురంటిన ఆకాశం

కారుమబ్బులు కమ్మిన ఆకాశం. పట్టపగలే చిమ్మచీకట్లు. రోజంతా అడపాదడపా వానలే. మధ్యమధ్యలో భారీ వర్షాలు. దీంతో జనజీవనం స్తంభించింది. కాలువలు పొంగిపార్లాయి. రోడ్లే కాలువలుగా మారాయి. వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ప్రతి చోటా దాదాపు ఇదే పరిస్థితి.



వర్షంతో నిండుగా ప్రవహిస్తున్న వరాహానది

కోటవురట్ల: భారీ వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జనజీవనం స్తంభించింది. పలు గ్రామాలకు వెళ్లే రహదారుల్లో ఎక్కడికక్కడ వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. దుగ్గాడ కాలువకు చాలా కాలానికి జలకళ వచ్చింది. ఎమ్మార్సీ ముందు, మండల పరిషత్ కార్యాలయం మెట్లు వరకు వర్షపు నీరు నిలిచిపోయింది. మెయిన్‌రోడ్డులో భారీగా వర్షం నీరు నిలిచిపోవడంతో చెరువును తలపించింది. యండపల్లి ఎస్సీ కాలనీ వద్ద మెయిన్‌రోడ్డుపై చెట్టు కూలిపోయింది. లింగాపురం–కొడవటిపూటి రహదారిలో కల్వర్టు లేకపోవడంతో వర్షం నీరు పొంగి ప్రవహించింది. వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు.

నక్కపల్లి: రెండు రోజుల నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు దేవవరం, గొడిచర్ల, ఉద్దండపురం, నక్కపల్లి, వేంపాడు, సీహెచ్‌ఎల్ పురం, పెదతీనార్ల, జానకయ్యపేట, ఉపమాక, చినదొడ్డిగల్లు తదితర ప్రాంతాల్లో కాలువలు, వాగుల ద్వారా వర్షపు నీరు భారీగా ప్రవహిస్తోంది. సీహెచ్‌ఎల్ పురం నుంచి పెదతీనార్లకు వెళ్లే మెయిన్‌రోడ్డుపైకి భారీగా వర్షపు నీరు చేరి రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. అల్పపీడనం కారణంగా మత్స్యకారులు చేపల వేటకు విరామం ప్రకటించారు. తెప్పలు, ఇంజన్లు, వలలను ఒడ్డున భద్రపరచి ఇళ్లకే పరిమితమయ్యారు. గడచిన వారం రోజులనుంచి వాతావరణంలో వచ్చిన మార్పులు, తుపాను హెచ్చరికల నేపథ్యంలో వేటకు వెళ్లట్లేదని, అలలు కూడా ఉధృతంగా ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయని మత్స్యకారులు తెలిపారు. వాతావరణ తీవ్రత తగ్గుముఖం పట్టే వరకు మత్స్యకారులెవరూ వేటకు వెళ్లొద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. వరి నారుమళ్లకు ఈ వర్షం బాగా ఉపయోగపడుతుందని రైతులు చెప్తున్నారు. విత్తనాలు జల్లి నారు కోసం ఎదురు చూస్తున్న రైతులకు ఈ వర్షం ఆనందాన్నిస్తోంది.

సాగునీటి కాలువల్లో వరద ఉధృతి

మునగపాక: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలు చోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లపై భారీగా నీరు నిలిచి రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బంది పడ్డారు. నారుమడులు వేసుకునేందుకు సిద్ధమవుతున్న తరుణంలో ఈ వర్షాలు రైతులకు అనుకూలంగా ఉంటాయని అధికారులు చెప్తున్నారు. మునగపాక శీలప్పన్న చెరువులో నీటి ఉధృతి పెరగడంతో రక్షణ గోడ కూలిపోయింది. చెరువును ఆనుకుని నివాసం ఉంటున్న ఆడారి ముసిలినాయుడు ఇంటి వెనుక భాగం కుంగిపోయింది. దీంతో సంబంధిత కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. కృష్ణంరాజు కాలువ, అనకాపల్లి ఆవ కాలువల్లో పెద్ద ఎత్తున నీరు వచ్చి చేరుతోంది.

రాంబిల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడన ప్రభావంతో మండలంలోని పలు ప్రాంతాల్లో బుధవారం భారీ వర్షం కురిసింది. పలు చోట్ల రోడ్లపై వర్షం నీరు నిలిచిపోయింది. వరి నారుమడుల్లో నీరు చేరింది. నారు మునిగిపోకుండా నీటిని తొలగించే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు.

ఎస్.రాయవరం: మండలంలో మంగళవారం రాత్రి, బుధవారం కురిసిన వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. వరహానది ఉప్పొంగి ప్రవహిస్తోంది. లోతట్టు ప్రాంతంలో ఉన్న సర్వసిద్ధి పాఠశాల ప్రాంగణం, పి.ధర్మవరం ఉన్నత పాఠశాలకు వెళ్లే రోడ్డుపై వర్షపు నీరు నిలిచి, చెరువులా మారాయి. దీంతో విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. దీని ఎత్తు పెంచాలని ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా, పట్టించుకోవట్లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.



మునగపాక శీలప్పన్న చెరువును ఆనుకుని కుంగిన ఇంటి వెనుకభాగం



కోటవురట్ల మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిలిచిపోయిన వర్షం నీరు



సర్వసిద్ధి స్కూల్ ప్రాంగణంలో చేరిన వర్షపునీరు



పి.ధర్మవరం స్కూల్ రోడ్డులో నిలిచిన వర్షపు నీరు



సీహెచ్‌ఎల్ పురంలో రోడ్డుపైకి చేరిన వర్షపు నీరు

జగనన్న సురక్షతో అందరికీ ప్రయోజనం



గుడివాడలో ధ్రువపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

ఎస్.రాయవరం: జగనన్న సురక్షలో ఉచితంగా అందిస్తున్న ప్రతి ధ్రువపత్రం ఎంతో ప్రయోజనకరమని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. గుడివాడ, గెడ్డపాలెం గ్రామాల్లో బుధవారం చివరిగా నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాలకి ఆయన హాజరయ్యారు. దరఖాస్తు చేసుకున్నవారందరికీ ధ్రువపత్రాలు అందిస్తూ, నాలుగేళ్లుగా తమ ప్రభుత్వం అందిస్తున్న పథకాలు సక్రమంగా అందాయా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలను మరింత చేరువ చేసేందుకే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. గ్రామ సభలకు అధికారులు వచ్చినపుడు స్థానిక సమస్యలు కూడా ప్రస్తావించాలన్నారు. వెంటనే పరిష్కరించకపోయిన ప్రభుత్వం దృష్టికి వస్తాయని, వాటిని తాము పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామచంద్రమూర్తి, తహసీల్దార్ విజయ్‌కుమార్, సర్పంచ్‌లు ధూళి శ్రీనుబాబు, కోశెట్టి వెంకటరమణ, కర్రి సత్యనారాయణ, మల్లే లోవరాజు, మత్యకార సంఘం జిల్లా అధ్యక్షుడు మాతా గురునాథ్‌రావు, వైఎస్సార్ సీపీ నాయకులు మామిడి చంటి, అచ్యుతరామరాజు, రామరాజు, జోగిబాబు, వర్మ రాజు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు



రిలే నిరాహార దీక్ష చేస్తున్న గిరిజనులతో సీపీఎం నాయకులు

కోటవురట్ల: అణుకు గిరిజనుల సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు దీక్ష కొనసాగిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు తెలిపారు. గిరిజనుల రిలే నిరాహార దీక్ష బుధవారానికి 20వ రోజుకు చేరింది. గిరిజనుల దీక్షకు సంఘీభావంగా సీపీఎం నాయకులు కూర్చున్నారు. అప్పలరాజు మాట్లాడు తూ అణుకు గ్రామానికి రహదారి నిర్మాణం, పాఠశాల ఏర్పాటుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు జి.డేవిడ్‌రాజ్, గిరిజనులు సూరిబాబు, రమేష్, అర్జున్ పాల్గొన్నారు.

విజయవంతంగా జగనన్న సురక్ష



అచ్యుతాపురం మండలంలో ధ్రువపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

అచ్యుతాపురం(అనకాపల్లి): జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతం అయ్యిందని, వలంటీర్లే ఇంటికి వచ్చి మరీ ప్రజలకు కావాల్సిన ధ్రువపత్రాల వివరాలను నమోదుచేసుకుని, ఎలాంటి రుసుము లేకుండా అందించే సువర్ణావకాశం ఒక్క సీఎం జగన్ పాలనలోనే సాధ్యమని యలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు అన్నారు. అచ్యుతాపురం మండలంలోని వెదురువాడ, ఇరువాడలో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన మాట్లాడారు. 11 రకాల ధ్రువపత్రాలను ఉచితంగా అందిస్తున్నామన్నారు. నాలుగు వేలకు పైగా దరఖాస్తుదారులకు వారికి కావాల్సిన సర్టిఫికెట్లను పంపిణీ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, ఎంపీపీ కోన సంధ్య బుజ్జి, జెడ్పీటీసీ లాలం రాంబాబు, సర్మాల కుమార్, సర్పంచ్‌లు గొర్లె అశ్విన్ నూకరాజు, చిన్నారావు, ఎంపీటీసీలు ఈత బాబూరావు, లాలం శ్రీనివాసరావు, పార్టీ నేతలు కూండ్రపు విమలనాయుడు, గొర్లె రామ జోగి, కారుకొండి గంగోలి శ్రీను, తోట వెంకటేష్, ఎంపీడీవో విజయలక్ష్మి, తహసీల్దార్ శ్రీనివాసరావు, చేకూరి శ్రీనివాసరావు, పిన్నమరాజు వాసు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కోటయ్య జయంతి



కోటయ్య చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న రాజారావు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని దుప్పుతూరులో చేనేత సంఘాల సృష్టికర్త ప్రగడ కోటయ్య జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పప్పు రాజారావు, తెడ్లపు సతీష్, రాజు చేతుల మీదుగా రూ.10 వేల చెక్కును దుప్పుతూరు భద్రావతి చేనేత కార్మికుల సంఘం అభివృద్ధికి అందించారు. కార్యక్రమంలో మాడెం నూకరత్నం, మాడెం సూరి అప్పారావు, మాడెం ఈశ్వరరావు, శెట్టి నరసింగరావు, మాడెం అప్పారావు, రాజు, అప్పలరాజు, అచ్యుతరావు, నానాజీ, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

హృద్రోగి రామకృష్ణకు సాయం

సాక్షి ఎఫెక్ట్..



బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న వరాహసత్యనారాయణ, బుజ్జి

మునగపాక: అనారోగ్యంతో బాధపడుతున్న మునగపాకకు చెందిన దొడ్డి రామకృష్ణ కుటుంబ సభ్యులను ఆదుకునేందుకు పలువురు దాతలు ముందుకొస్తున్నారు. రామకృష్ణ గత కొంత కాలంగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. పేదరికంతో ఆర్థిక స్తోమత లేక గుండెమార్పిడి శస్త్ర చికిత్స చేయించుకోలేకపోతున్నాడు. దీంతో ఈ నెల 19న 'గుండె మార్పిడి శస్త్ర చికిత్సకు సాయం చేయరూ'పేరిట సాక్షిలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనికి స్పందించిన పలువురు దాతలు రామకృష్ణకు సాయమందించేందుకు ముందుకొస్తున్నారు. మాజీ వైస్ ఎంపీపీ దొడ్డి వరాహసత్యనారాయణ, పాల సంఘ అధ్యక్షుడు దొడ్డి బుజ్జి కలిసి రూ.15 వేల సాయం అందించారు. కేకే డెవలపర్స్ అధినేత కాండ్రేగుల చందు రూ.10 వేలు, టీడీపీ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు పెంటకోట విజయ్ రూ.10 వేలు, వేద పండితులు వెలవలపల్లి కోటేశ్వరశర్మ రూ.5 వేలు, వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు రూ.10 వేలు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ దొడ్డి శ్రీనివాసరావు రూ.10 వేలు ఇలా ఎవరికి తోచిన సాయం వారు అందిస్తున్నారు. మునగపాకకు చెందిన ఉత్సవ కమిటీ చైర్మన్, సచివాలయ కన్వీనర్ బొడ్డేడ అప్పలనాయుడు మిత్రబృందం దాతల నుంచి విరాళాలు సేకరిస్తూ బాధిత కుటుంబానికి అండగా నిలుస్తున్నారు.

కొక్కిరాపల్లిలో 'జగనన్న సురక్ష' నేడు

యలమంచిలి: యలమంచిలి మున్సిపాలిటీ పరిధి కొక్కిరాపల్లి గ్రామంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ కె.వీరయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కన్నబాబురాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార్ వర్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీరు పాల్గొనాల్సిందిగా కోరారు.

అరబుపాలెం అభివృద్ధికి ఎస్‌బీఐ ఫౌండేషన్ కృషి



మాట్లాడుతున్న అరబుపాలెం సర్పంచ్ శ్రీనివాసరావు

మునగపాక: అరబుపాలెం గ్రామాభివృద్ధికి ఎస్‌బీఐ ఫౌండేషన్ అందిస్తున్న సహకారం అభినందనీయమని సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక సచివాలయంలో బుధవారం గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరబుపాలెంలో సమస్యల పరిష్కారానికి ఎస్‌బీఐ ఫౌండేషన్ ఎంతో కృషి చేస్తోందన్నారు. ఇటీవల 150 మంది రైతులకు రాయితీపై విత్తనాలు అందించినట్టు తెలిపారు. క్రిమి సంహారక మందులు కూడా రాయితీపై అందించాలని కోరారు. శ్మశానవాటికలో షెడ్ నిర్మాణానికి ఫౌండేషన్ ముందుకొచ్చిందన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు పూజిత, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే గొల్ల బాబూరావు
- జోరు వానలోనూ కొనసాగిన కార్యక్రమం



జోరువానలో సైతం: స్థానికులకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

ఎస్.రాయవరం: ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగపరచుకుని, రాబోయే ఎన్నికల్లో మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు కోరారు. వాకపాడు శివారు కాపుల వాతాడ గ్రామంలో బుధవారం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఆయన పాల్గొన్నారు. జోరు వానలోనూ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. వర్షంలో వస్తున్న ఎమ్మెల్యేను చూసి ప్రతి ఒక్కరూ తమ ఇంట్లోకి రావాలంటూ ఆహ్వానించారు. వారందరినీ ఆత్మీయంగా పలకరించుకుంటూ, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును ఆరా తీశారు. తాము ఎవరి చుట్టూ తిరగాల్సిన పనిలేకుండానే సంక్షేమ పథకాల లబ్ధి తమ ఖాతాల్లో జమ అవుతోందని, వాటితో చాలా వరకు తమ ఇబ్బందులు తీరుతున్నాయని పలువురు స్థానికులు ఎమ్మెల్యే వద్ద తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మైలపల్లి శ్రీనివాసరావు, తిమ్మాపురం, పెదఉప్పలం, సర్పంచ్‌లు కర్రి సత్యనారాయణ, కోశెట్టి వెంకటరమణ, జిల్లా మత్యకార సంఘ అధ్యక్షుడు గురునాథ్‌రావు, మాజీ జెడ్పీటీసీ కణంకోట నీలేంద్రరావు, మాజీ ఎంపీటీసీ మైలపల్లి రాజారావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం పదవి చంద్రబాబుకి ఇక కలే..



పెదపల్లిలో జగనన్న సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు



రేషన్‌కార్డు అందిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు జగన్నాథం

- చంద్రబాబు, దత్తపుత్రుడు పవన్ సీఎం జగన్‌ను ఏమీ చేయలేరు
- జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నబాబురాజు

యలమంచిలి: సీఎం పదవి చంద్రబాబునాయుడుకు ఇక కలేనని, ఎంత మంది కలిసి కూటమిగా వచ్చినా జగన్‌మోహన్‌రెడ్డి గెలుపును అడ్డుకోలేరని ఎమ్మెల్యే కన్నబాబురాజు అన్నారు. బుధవారం యలమంచిలి మున్సిపాలిటీ పరిధి పెదపల్లి గ్రామంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార్‌వర్మతో కలిసి వివిధ ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగపరచుకుని, ప్రతి ఒక్కరూ సంక్షేమ లబ్ధిని పొందాలని కోరారు. చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్‌లు వలంటీర్లపై అవమానకరమైన వ్యాఖ్యలు చేయడం దారుణమని, తలకిందుల తపస్సు చేసినా చంద్రబాబునాయుడు మళ్లీ ముఖ్యమంత్రి అయ్యే అవకాశాల్లేవని స్పష్టం చేశారు. దత్తపుత్రుడు పవన్‌కల్యాణ్‌తో కలిసి ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వంలో ప్రతి కార్యక్రమం అవినీతిమయమని, ప్రజలకు సకాలంలో పథకాలు అందేవి కావన్నారు. జగన్ సీఎం అయ్యాకే యలమంచిలి మున్సిపాలిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బోదెపు గోవింద్, మున్సిపల్ వైస్ చైర్మన్లు అర్రెపు గుప్తా, బెజవాడ నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు బొద్దపు యర్రయ్యదొర, తహసీల్దార్ రాణి అమ్మాజీ, మున్సిపల్ కమిషనర్ కె.వీరయ్య, కౌన్సిలర్లు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

జగన్ కుర్చీని తాకడం ఎవరి తరం కాదు

మునగపాక: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కుర్చీని తాకడం ఎవరి తరం కాదని ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు అన్నారు. కుర్చీలో కూర్చున్నది పులి అని, ప్రతిపక్షాలన్నీ కలిసి వచ్చినా వచ్చే ఎన్నికల్లో మరోసారి జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావడం తథ్యమన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా బుధవారం మునగపాక సచివాలయం వద్ద అర్హులైన వారికి పలు ధ్రువపత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అర్హులైనవారందరికీ సంక్షేమం,అభివృద్ధి, ఇతర సేవలందిస్తున్న ప్రభుత్వం వైఎస్సార్ సీపీయేనన్నారు. గతంలో ప్రభుత్వ పథకాలు పొందాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, తమ ప్రభుత్వంలో వలంటీర్లే ఇంటి వద్దకు వచ్చి ప్రతి సేవనూ అందిస్తున్నారని తెలిపారు. ప్రజలకు నిస్వార్థమైన సేవలందిస్తున్న వలంటీర్లపై బాబు దత్తపుత్రుడు పవన్‌కల్యాణ్ ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు రొంగలి జగన్నాథం మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ పాలన సాగుతోందన్నారు. మహిళలంతా రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి గెలిపించాలని కోరారు. ప్రజల కష్టాలు తెలుసుకొని వాటి పరిష్కారానికి నిరంతరం పరితపిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి మరో 20 ఏళ్లపాటు సీఎంగా కొనసాగుతారని ధీమా వ్యక్తం చేశారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ, పార్టీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, సచివాలయాల మండల కన్వీనర్ పాలిమేర గణేష్, ఎంపీటీసీలు సూరిశెట్టి రాము, బోడకుర్తి గణేష్, సచివాలయాల కన్వీనర్లు టెక్కలి కొండలరావు, బొడ్డేడ అప్పలనాయుడు, డీఎల్‌డీవో మంజులవాణి తదితరులు పాల్గొన్నారు.


జగనన్న సురక్షతో ప్రజలకు మేలు



కుమారపురంలో అర్హులకు ధ్రువపత్రాలు అందిస్తున్న నాయకులు

పాయకరావుపేట : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ఏళ్ల తరబడి పలు ధ్రువపత్రాలకు నోచుకోనివారి పాలిట వరంగా మారడంతోపాటు, గ్రామస్థాయి సమస్యలకు పరిష్కారం చూపుతోందని ఎంపీడీవో ఎ.సాంబశివరావు, తహసీల్దార్ కె.జయప్రకాష్‌లు అన్నారు. మండలంలోని కుమారపురం గ్రామంలో తహసీల్దార్ జయప్రకాష్ బృందం, రాజవరంలో ఎంపీడీవో సాంబశివరావు బృందాలు బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమాలను నిర్వహించారు. కుమారపురం గ్రామ సచివాలయ పరిధిలో 214 మందికి దరఖాస్తుదారులకు గ్రామ సర్పంచ్ పెరుమళ్ళ గోవిందమ్మ, తహసీల్దార్ చేతుల మీదుగా ధ్రువపత్రాలు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు నీలాపు మహేష్ రెడ్డి, చిరంజీవి రెడ్డి, బాలకృష్ణారెడ్డి, వెంకటరెడ్డి పాల్గొన్నారు. రాజవరం గ్రామ పరిధిలో 317 మంది దరఖాస్తుదారులకు సర్పంచ్ గోసల అమ్మాజీ, ఎంపీటీసీ గోసల మరిణమ్మ, ఎంపీడీవో చేతుల మీదుగా సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ కార్యదర్శి వై.అన్నవరం, కాకాడ కృష్ణ, ఈవోఆర్‌డీ వైవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వరి నారుమళ్లలో పొడ తెగులు



రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

నక్కపల్లి: వరి నారుమళ్లకు పొడ తెగులు సోకుతోందని, రైతులు ముందుగానే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు హెచ్చరించారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో వరి నారుమళ్లను వారు పరిశీలించారు. ఏవో ఉమాప్రసాద్ ఆధ్వర్యంలో శాస్త్రవేత్తల బృందం పర్యటించింది.

నీటి గుంతలో పడి వ్యక్తి మృతి

కోటవురట్ల: నీటి గుంతలో ప్రమాదవశాత్తు జారిపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. తంగేడు గ్రామానికి చెందిన అంకంరెడ్డి నూకరాజు(45) బుధవారం రామన్నపాలెంలో క్వారీ పక్కనున్న పొలంలో పనిచేసుకుంటూ పక్కనే నీటి గుంతలో ప్రమాదవశాత్తు జారి మునిగిపోయాడు. ఇంతలో కేకలు వినిపించేసరికి పక్కనే పొలం తీస్తున్న నూకరాజు అన్నయ్య శ్రీను పరుగున వెళ్లి మునిగిపోతున్న అతనిని బయటకు తీసి కోటవురట్ల సీహెచ్‌సీకి తరలించాడు. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతునికి భార్య లక్ష్మి, ముగ్గురు పిల్లలు ఉన్నారు. సమాచారం తెలియడంతో దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ నారాయణరావు తెలిపారు.